## క్లుప్తంగా

### రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

**కోవెలకుంట్ల:** స్థానిక జ్యోతి విద్యానికేతన్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ సవిత్‌నాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 1వ తేదీన పట్టణంలోని సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల ఆవరణలో సబ్ జూనియర్ జిల్లా స్థాయి సూపర్‌సెవన్ క్రికెట్ జట్టును ఎంపిక చేశారన్నారు. పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ నెల 15, 16వ తేదీల్లో వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్ట జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సూపర్‌సెవెన్ క్రికెట్ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. జిల్లాస్థాయికి ఎంపికైన టీమ్‌ను కరస్పాండెంట్ తోపాటు ప్రిన్సిపాల్ సింధూరి, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

### వాహనం ఢీకొని దుప్పి మృతి



**డోన్:** కర్నూలు – బెంగళూరు జాతీయ రహదారిపై ఉడుములపాడు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒక దుప్పి మృతి చెందింది. వర్షాలు సకాలంలో కురవకపోవడం, సమీపంలోని అడవుల నుంచి పంట పొలాల్లోకి వస్తున్న జింకలు, దుప్పిలు తరచుగా రోడ్డుదాటుతూ వాహనాలు ఢీకొనడంతో మృతిచెందుతున్నాయి. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు దుప్పి కళేబరాన్ని పోస్టుమార్టం నిమిత్తం పశువైద్యశాలకు తరలించి అనంతరం ఖననం చేశారు.

### గురుకుల పాఠశాల తనిఖీ



వంటలను పరిశీలిస్తున్న ఎంపీపీ, అధికారులు

**డోన్ :** మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం నాణ్యత ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ ప్రభాకర్‌లు ఉపాధ్యాయులకు సూచించారు. పట్టణంలోని అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం పనితీరును శుక్రవారం వారు పరిశీలించారు. ప్రతిరోజు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వసతిగృహం, వంట గదిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు.

### రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కొర్రల ప్యాకెట్‌లను ఉచితంగా పంపిణీ చేస్తున్న దృశ్యం

**ప్యాపిలి:** రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీటీసీ సభ్యులు బోరెడ్డి శ్రీరామిరెడ్డి అన్నారు. స్థానిక ఆర్బీకేలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. జెడ్పీటీసీ, చైర్మన్ మాట్లాడుతూ రైతులు ఏ పంట పండించినా తప్పని సరిగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. స్వల్పకాలిక పంటలతో అధిక లాభాలు ఉన్నాయని, చిరుధాన్యాల సాగుపై రైతులు దృష్టి సారించాలన్నారు. అనంతరం రాచర్ల, బోంచెర్వుపల్లి, నేరేడుచెర్ల గ్రామాలకు చెందిన 90 మంది రైతులకు 4 కేజీల చొప్పున కొర్రల ప్యాకెట్ ఉచితంగా అందజేశారు.

### జాగ్రత్తలు పాటించండి

**డోన్:** వర్షాకాలం సందర్భంగా గ్రామాలలో పరిశుభ్ర వాతావరణం నెలకొల్పాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై ఉందని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఈఓఆర్‌డి వరప్రసాద్‌రావ్ అధ్యక్షతన జరిగిన మండలస్థాయి పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్ల సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. గ్రామాలలో వర్షపు నీటి నిల్వలు లేకుండా చూడటంతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించేట్లు ప్రజలలో అవగాహన కల్పించాలని సూచించారు.

### ఆకుకూరలు, కూరగాయల తోటలు పెంచాలి

**కోవెలకుంట్ల:** ఆకుకూరలు, కూరగాయల తోటలను విరివిగా పెంచాలని యాగంటి పల్లె కృషి విజ్ఞాన కేంద్ర గృహ విజ్ఞానశాస్త్రవేత్త లక్ష్మీప్రియ సూచించారు. శుక్రవారం స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల ఆవరణలో జీఎంజే సోషల్ సర్వీస్ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు పోషకాహార తోటల పెంపకంపై ఒకరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణలో ఆకుకూరలు, కూరగాయల తోటలను పెంచుకోవాలని సూచించారు. అనంతరం మహిళలకు ఆకుకూరలు, కూరగాయల విత్తన కిట్లను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సోషల్ సర్వీస్ సామాజిక కార్యకర్త జాన్‌మేరీ, మహిళలు పాల్గొన్నారు.

### బీసీ హాస్టల్ తనిఖీ

**సంజామల:** మండల కేంద్రం సంజామలలోని బీసీ హాస్టల్‌ను శుక్రవారం బీసీ సంక్షేమ సహాయ అధికారి ఎం.నరసయ్య తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం రుచి చూశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. క్రమశిక్షణతో చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి రోజు వసతి గృహానికి రావాలని, విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని మునిరాజుకు సూచించారు.

# జగనన్న విజయాన్ని అడ్డుకోలేరు!

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

**కొలిమిగుండ్ల:** ప్రజల దీవెనలు నిండుగా ఉన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయాన్ని వచ్చే ఎన్నికల్లో ఎవ్వరూ అడ్డుకోలేరని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి స్పష్టం చేశారు. మండల పరిధిలోని నాగిశెట్టిపల్లె, బిఉప్పలూరు, బితాడిపత్రి, హనుమంతుగుండం గ్రామాల్లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ ప్రసాదరెడ్డి, తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్, ప్రజాప్రతినిధులతో కలిసిన ఆయా గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రతి గడపకు వెళ్లి నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు జరిగిన లబ్ధిని వివరించారు. ఆయా కుటుంబాలకు వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. అదేవిధంగా ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకుని పరిష్కార చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి మాట్లాడుతూ పేదల కష్టాల తెలిసిన ప్రభుత్వం తమదని, అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని చెప్పారు. గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లు ఏర్పాటు చేసి ప్రజల వద్దకు పాలన అందిస్తున్నారని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలలో 98 శాతం అమలు చేశారని గుర్తు చేశారు. ప్రజల వద్దకే పాలన సాగించేందుకు రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీని ఆదరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈశ్వరయ్య, మండల ఉపాధ్యక్షుడు క్రిష్టారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, నాయకులు సత్తిగారి రామిరెడ్డి, కోఆప్షన్ మెంబర్ సలీం భాష,పుల్లయ్య, చిన్న గోవిందప్ప, నాగరాజు, క్రిష్టయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, బాలయ్య, దానం, మనోహర్, రామన్న, సత్యనారాయణ, నరసింహనాయుడు, సురేష్, వెంకట రామసుబ్బయ్య, జిల్లా పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శేషారెడ్డి ముందుచూపుతోనే బేతంచెర్ల అభివృద్ధి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఉర్దూ లకాడమీ సభ్యులు మూర్తుజావలీ, ముస్లిం సోదరులు

**బేతంచెర్ల:** స్వాతంత్ర్య వచ్చిన తొలి రోజుల్లోనే డోన్ ఎమ్మెల్యేగా సేవలు అందించిన రావు బహదూర్ బీపీ శేషారెడ్డిని విమర్శించే అర్హత డోన్ టీడీపీ ఇంచార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డికి లేదని రాష్ట్ర ఉర్దూ అకాడమీ సభ్యులు మూర్తుజావలీ, ముస్లిం మైనార్టీ నాయకులు నజీర్, అల్తాఫ్, సత్తార్ అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. బేతంచెర్ల పట్టణంలో గురువారం జరిగిన టీడీపీ బహిరంగ సభలో ధర్మవరం సుబ్బారెడ్డి బేతంచెర్లలో షాదిఖానాకు బీపీ శేషారెడ్డి పేరు ఎందుకు పెట్టారని అనడం భావ్యం కాదన్నారు. అప్పట్లోనే బీపీ శేషారెడ్డి బేతంచెర్ల మండలానికి ముందు చూపుతో గుడి, బడి, దేవాలయాలు, ఆసుపత్రులు నిర్మించిన మహోన్నత వ్యక్తి అన్నారు. నాడు కుగ్రామంగా ఉన్న బేతంచెర్ల నేడు నాపరాళ్ల పారిశ్రామిక వాడగా అభివృద్ధి చెందిదంటే బుగ్గన వంశస్తుల ముందు చూపే కారణమన్నారు. ముస్లిం మైనార్టీ సోదరుల సమ్మతితోనే ముస్లిం మైనార్టీ బీపీ శేషారెడ్డి షాదిఖానా అనే పేరు పెట్టడం జరిగిందని, ఇందులో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రమేయం లేదన్నారు. శేషారెడ్డి ఉన్నత పాఠశాలపై నిజా నిజాలు తెలుసుకొని మాట్లాడాలని, అసత్య ఆరోపణలు చేస్తే నీకు రాజకీయ భవిష్యత్తు ఉండదని హెచ్చరించారు.

## రైతు సంక్షేమానికి పెద్దపీట

- జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు



రైతులకు కొర్ర విత్తనాలను పంపిణీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

**కోవెలకుంట్ల:** రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేసి వ్యవసాయాభివృద్ధికి అనేక ప్రోత్సాహాలు కల్పిస్తోందని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం మండల వ్యవసాయ సలహా మండలి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా పథకం ద్వారా ప్రతిఏటా రైతులకు రూ. 13,500 చొప్పున పెట్టుబడి సాయం, రాయితీపై విత్తనాలు, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు సరఫరా చేస్తోందన్నారు. రైతు భరోసా కేంద్రాలద్వారా వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం అందుతోందన్నారు. చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం కల్పిస్తోందని పేర్కొన్నారు. అనంతరం రైతులకు కొర్ర విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ సుధాకర్, ఏఓ నిరంజన్, సలహామండలి చైర్మన్ రామసుబ్బారెడ్డి, వెటర్నరీ డాక్టర్ కృష్ణకుమార్, వెలగటూరు సర్పంచ్ ఎల్వీ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**రైతు భరోసా కేంద్రం తనిఖీ**

**కొలిమిగుండ్ల:** మండల పరిధిలోని ఇటిక్యాల రైతు భరోసా కేంద్రాన్ని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు తనిఖీ చేసి రిజిష్టర్లు పరిశీలించారు. కౌలు రైతు కార్డులు, వైఎస్సార్ యంత్ర సేవా తదితర వాటి గురించి అగ్రికల్చర్ అసిస్టెంట్ ఫిరోజ్‌ను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ శాఖ అందించే సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకునే రైతులను చైతన్య పరచాలని సిబ్బందికి సూచించారు.

### ఓటు హక్కు బాధ్యతగా కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటరెడ్డి

**డోన్ టౌన్ :** 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే బాధ్యత బూత్ లెవల్ అధికారులపై ఉందని ఆర్డీఓ వెంకటరెడ్డి అన్నారు. స్థానిక ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో తహసీల్దార్ విద్యా సాగర్ ఆధ్వర్యంలో ఓటర్ల తనిఖీలు, ఇంటింటా సర్వే కార్యక్రమాలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆర్డీఓ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21తేదీ నుంచి ప్రతి ఇంటికి బూత్ లెవల్ అధికారి వెళ్లి ఓటర్లను, ఓటర్ల జాబితాతో సరి చూడాలన్నారు. అలాగే అర్హత వయసు వచ్చిన వారిని కొత్త ఓటరుగా యాప్‌లోనే ఆన్‌లైన్‌లో నమోదు వారి ఇంటి వద్దనే చేయాలని ఆదేశించారు. ఓటరు నమోదులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆర్డీఓ వివరించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ మధు, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేదల జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లు అందజేస్తున్న చలంరెడ్డి

**బేతంచెర్ల:** సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు పథకాలు ప్రవేశపెట్టి పేదల జీవితాల్లో వెలుగులు నింపారని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని సుబ్బారెడ్డి నగర్‌లో నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు చింతల నాగిరెడ్డి, మధు, కోట్ల మధు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కొత్తగా విద్యుత్ స్తంభాలు, రోడ్లు, డ్రైనేజీ కాల్వలు ఏర్పాటు చేయాలని స్థానికులు అధికారుల దృష్టికి తేగా పరిష్కార చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయా కుటుంబాలకు వర్తించిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం చలం రెడ్డి మాట్లాడుతూ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో 330 కోట్లతో చేపట్టిన గోరుకల్లు రిజర్వాయర్ ద్వారా రానున్న రోజుల్లో ఇంటింటికీ తాగునీటి కుళాయితోపాటు శుద్ధమైన నీరు అందజేస్తామన్నారు. వైఎస్సార్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని చూపి వచ్చే ఎన్నికల్లో మరోమారు పట్టం కట్టాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గూనినాగరాజు, శేఖరయ్య, భాస్కర్, నజీర్, తిరుమలేశ్వర్ రెడ్డి , ఆజాం బాషా, సంధానీ బాషా, ఎద్దులన్న, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### నాలుగు లారీలకు జరిమానా

**బేతంచెర్ల:** బనగానపల్లె మండలం పలుకూరు నుంచి నాపరాళ్ల లోడుతో రాయల్టీలు లేకుండా హైదారబాద్ వెళ్తున్న నాలుగు లారీలపై కేసులు నమోదు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు రాయల్టీ టెక్నికల్ ఇన్‌స్పెక్టర్ బాలు నాయక్ తెలిపారు. ఒక్కోలారీపై రూ. 20 వేల చొప్పున రూ.80 వేల జరిమానా విధించామని ఆయన తెలిపారు.

## నూతన భవనాలు ముస్తాబు

- నేడు రూ.1.59కోట్లతో పూర్తయిన అభివృద్ధి పనులను ప్రారంభించనున్న ఎమ్మెల్యే కాటసాని



రూ.21.8 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం



రూ.17.5 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లీనిక్ సెంటర్

**అవుకు:** మండల పరిధిలోని అన్నవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ భవనాలు ప్రారంభోత్సవానికి ముస్తాబయ్యాయి. రూ.35లక్షలతో గ్రామ సచివాలయ భవనం, రూ.21.8 లక్షలతో రైతుభరోసా కేంద్రం, రూ.17.5లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్, రూ.5లక్షలతో నిర్మించిన శుద్ధజల కేంద్రం, రూ.55లక్షలతో డ్రైనేజీల ఏర్పాటు, రూ.25లక్షలతో బీసీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణాలు జరిగాయి. ఈ మేరకు రూ.1.59కోట్లతో పూర్తయిన అభివృద్ధి పనులను శనివారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభిస్తారని వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి తెలిపారు. అదేవిధంగా అన్నవరం గ్రామపంచాయతీ పరిధిలోని అన్నవరంతోపాటు చిన్న కొట్టాల, నిప్పులవాగు గ్రామాల్లో ఎమ్మెల్యే గడ గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు చెప్పారు.

### ఓటు నమోదు చేసుకోవాలి

**కోవెలకుంట్ల:** ఓటు హక్కు లేని 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు కొత్తగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ పుష్పకుమారి సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని బూత్ లెవల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 21వ తేదీ నుంచి నెల రోజులపాటు ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటుహక్కు నమోదు ప్రత్యేక కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కొత్తగా ఓటు నమోదుతో పాటు ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు, సవరణలు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ ఇమ్రాన్, వీఆర్ఓలు పాల్గొన్నారు.

### అప్రమత్తంగా ఉండాలి

**బనగానపల్లెరూరల్:** డెంగీ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివ శంకరుడు సూచించారు. మండలంలోని టంగుటూరులో ఫ్రైడే డ్రై డే పాటించి ర్యాలీ నిర్వహించారు. మురుగు కాల్వల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. ఆయన మాట్లాడుతూ వర్షకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు సోకేప్రమాదం ఉందని, ప్రతిఒక్కరూ వ్యక్తిగతంతోపాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ అయ్యమ్మ, స్టాఫ్ నర్సు శివకుమార్, ల్యాబ్ టెక్నీషియన్ హసీనా, ఏఎన్ఎంలు,ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

### నేడు కోవెలకుంట్లలో జగనన్న సురక్ష

**కోవెలకుంట్ల:** స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని 1వ గ్రామ సచివాలయ ఆవరణలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాధిక తెలిపారు. అర్హతలు ఉండి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వర్తించని కుటుంబాలకు పథకాలు అందజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా కార్యక్రమం అమలు చేస్తోందన్నారు. జగనన్న సురక్షలో 11 రకాల సేవలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

### నేడు ప్రజాప్రతినిధుల రాక

**కోవెలకుంట్ల:** మండలంలోని కలుగొట్లకు శనివారం ప్రజాప్రతినిధులు రానున్నారని వైఎస్సార్‌సీపీ నాయకుడు మాచిరెడ్డి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. వివిధ కాలనీల్లో రూ. 1.05 కోట్లతో నిర్మించిన సీసీరోడ్లు, డ్రైనేజీ పనులను ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజా హర్షవర్ధన్‌రెడ్డి తదితర ప్రముఖులు ప్రారంభిస్తారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### బైకు చోరీ

**డోన్ టౌన్ :** పట్టణ సమీపంలోని కోట్లవారిపల్లెలో రైతు రామకృష్ణ బైకు చోరీకి గురైంది. కోట్లవారిపల్లెలో ఉన్న రెడ్డప్ప నర్సరీ వద్ద ఉంచిన టీవీఎస్ బైకును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని, రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశానని బాధిత రైతు తెలిపారు.

### నేడు పెరుసోములలో జగనన్న సురక్ష

**సంజామల:** మండల పరిధిలోని పెరుసోముల సచివాలయ ఆవరణలో శనివారం జగనన్న సురక్ష సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగకుమార్ తెలిపారు. అర్హత ఉండి ఇంకా ప్రభుత్వ పథకాలు అందనివారు, ఆదాయ, కుల తదితర ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డులో మార్పులు తదితర 11 రకాల ప్రభుత్వ సేవలు అందజేస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### ఉద్యాన పంటల కలెక్షన్ సెంటర్ల పరిశీలన

**ప్యాపిలి:** మండల పరిధిలోని జలదుర్గం, చిన్నపొదిళ్ల గ్రామాల్లో ఉద్యాన రైతులు ఏర్పాటు చేసుకున్న కలెక్షన్ సెంటర్లను సూక్ష్మ నీటి పారుదల శాఖ పీడీ ఉమాదేవి, జిల్లా ఉద్యాన అధికారి నాగరాజు తదితరులు శుక్రవారం పరిశీలించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసుకున్న ఈ సెంటర్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యానశాఖ అధికారిణి కళ్యాణి, జలదుర్గం సర్పంచ్ దస్తగిరి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, ఎఫ్‌పీఓ అధ్యక్షులు సతీష్ రెడ్డి, జమాల్ బాష పాల్గొన్నారు.

## అన్నీ తానై సేవలందించాడు..



మహిళ కుటుంబానికి మాస్కులను అందిస్తున్న వలంటీర్ లంకెల శ్రీనివాసులు..

ఈ ఫోటోలో మాస్కులు పంపిణీ చేస్తున్న లంకెల శ్రీనివాసులు అవుకు–3 గ్రామ సచివాలయ పరిధి వలంటీర్. 2020లో కరోనా మహమ్మారి తాండవం చేస్తున్న రోజులవి. సేవాదృక్పథంతో ప్రాణాలకు తెగించి తన పరిధిలోని యాభై కుటుంబాలకు అన్నీతానై సేవలందించాడు. నిత్యావసర సరుకులు, మందులు, మాస్కులు అందజేయడంతో ఆరోగ్య సూత్రాలు వివరిస్తూ అండగా నిలిచాడు. ప్రత్యేకించి హోమ్ క్వారంటైన్‌లోని వృద్ధులకు పింఛన్ డబ్బులు అందజేస్తూ భయందోళన అవసరం లేదని మనోధైర్యానిచ్చాడు. బంధువులు, స్నేహితులు కన్నెత్తి చూడని తరుణంలో వలంటీర్ లంకెల చేసిన సేవలను ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారు ఆయా కాలనీల ప్రజలు.

### ప్రాణాలకు తెగించి సేవ చేశాడు..



వలంటీర్ల సేవలు అద్భుతం. పేదలకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయడంతోపాటు అన్నివిధాలుగా చైతన్యపరుస్తున్నారు. ప్రత్యేకించి లాక్‌డౌన్‌లో ప్రజల ఇబ్బందులు వర్ణనాతీతం. ఆ సమయంలో వలంటీర్ చేసిన సేవలు ఇప్పటికీ గుర్తున్నాయి. ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితులో తామున్నామంటూ సాయం చేశారు. నిత్యావసర సరుకులుల, పింఛన్, వైద్య సలహాలు తదితర సేవలు నాకు తెలిసి ఎవ్వరూ మరిచిపోరు. ప్రతి ఇంటి తలుపు తట్టి సాయం చేశారు. మాస్కులు అందజేసి జాగ్రత్తలు వివరించారు. వలంటీర్ల సేవలను ఎవరు తప్పుపట్టినా వారిదే పెద్దతప్పు.

– నేనావత్ సరస్వతి భాయి, రాజా వీధి, అవుకు..

## పారిశుద్ధ్య కార్మికుడు కాదు... వలంటీర్



బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న వలంటీర్ మహబూబ్ బాషా(ఫైల్)

ఈ ఫొటోలో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న వ్యక్తి పారిశుద్ధ్య కార్మికుడు కాదు...సంజామల మండలం ముక్కమల్ల గ్రామానికి చెందిన వలంటరీ మహబూబ్ బాషా. 2020 కరోనా విజృంభించిన సమయంలో ఎవ్వరూ బయటకు రాలేని పరిస్థితి. ఇంటింటికీ వెళ్లి నిత్యావసర సరుకులు అందజేస్తూ అండగా నిలిచాడు. కొన్ని కాలనీల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారడాన్ని గుర్తించిన మహబూబ్ బాషా తోటి వలంటీర్ల సాయంతో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. అనారోగ్యానికి గురైన వ్యక్తులకు కరోనా పరీక్షలు సైతం చేయించి మనోధైర్యాన్ని నింపారు. వలంటీర్ల స్వచ్ఛందంగా చేసిన సేవలను ఇప్పటికీ గుర్తు చేస్తున్నారు ఆ గ్రామ ప్రజలు.

### వలంటీర్‌ల సేవలు మరువలేనివి...



కరోనా సమయంలో వలంటీర్ల చేసిన సేవలు మరువలేనివి. ప్రత్యేకించి మా గ్రామంలో బయటకు రాలేని పరిస్థితుల్లో వలంటీర్లు అంకిత భావంతో సేవందించారు. మురుగు కాల్వల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లిన తీరు వారి అంకితభావ సేవలకు ప్రత్యక్ష నిదర్శనం. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందజేసిన సాయంతోపాటు దాతల నుంచి సేకరించిన నిత్యావసర సరుకులు అందజేస్తూ అందరికీ సాయపడ్డారు. వలంటీర్ల సేవలను తప్పుపడితే ఎంతటివారైనా వారు మూర్ఖులే.

– పోచా వెంకటరామిరెడ్డి, ముక్కమల్ల గ్రామపెద్ద

## సంక్షిప్తం

**మెస్ చార్జీలు పెంచాలి**

**డోన్ టౌన్ :** పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా జగనన్న గోరుముద్ద పథకం మెస్ చార్జీలు, వర్కర్ల జీతాలు పెంచాలని ఏపీ మధ్యాహ్న భోజనం పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకుడు అబ్బాస్ కోరారు. పట్టణంలోని పలు పాఠశాలలను శుక్రవారం ఆయన సందర్శించారు. వర్కర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

**క్రమ శిక్షణ విద్యతో అభివృద్ధి**

**డోన్ టౌన్ :**విద్యార్థులు క్రమ శిక్షణతో కూడిన విద్యను అభ్యశిస్తే అభివృద్ధి చెందుతారని మోడల్ స్కూల్ ప్రిన్స్‌పాల్ జాస్మిన్, మాస్టర్ ట్రైనర్ మాధవ స్వామి అన్నారు. పట్టణ సమీపంలోని మోడల్ స్కూల్లో శుక్రవారం విద్యార్థులకు జ్ఞాపక శక్తి, మైండ్ మెమోరీ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో ఐక్యూ మెమోరీని పరీక్షల ద్వారా గుర్తించే విధానంపై అవగాహన కల్పించారు.

**ట్రిబుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక**

**బేతంచెర్ల:** మండల పరిధిలోని మోడల్ స్కూలు విద్యార్థి సాయి చరిత పాటు, పట్టణంలోని జెడ్పీ హైస్కూలు విద్యార్థులు పూజితా రెడ్డి, మైత్రి ఇడుపుల పాయలోని ట్రిబుల్ ఐటీకి ఎంపికై నట్లు మోడల్ స్కూలు ప్రిన్సిపాల్ డాక్టర్ గంగుల నాగరాజు, జెడ్పీ హైస్కూలు హెచ్ఎం అబ్రహాం తెలిపారు. విద్యార్థులను ఎంఈఓ సోమశేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు.

**నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం**

**బనగానపల్లె:** విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మతులు చేస్తున్నందున పాతపాడు, పసుపల, బనగానపల్లెలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

**నేడు పసుపల, యనకండ్ల గ్రామాల్లో జగనన్న సురక్ష**

**బనగానపల్లె:** మండలంలోని పసుపల, యనకండ్ల గ్రామ సచివాయాల్లో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివరామయ్య శుక్రవారం తెలిపారు. ప్రజలకు 11 రకాల ప్రభుత్వ సేవలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని, సంక్షేమ పథకాలకు సంబంధించి అర్హత కలిగిన పేదల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

**కోలుకోలేక వివాహిత మృతి**

**బనగానపల్లెరూరల్:** మండల పరిధిలోని ఇల్లూరు కొత్తపేటకు చెందిన వివాహిత తూర్పునాటి వీరమ్మ(36) నంద్యాల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ రామిరెడ్డి శుక్రవారం తెలిపారు. పదేళ్లైనా పిల్లలు పుట్టకపోవడంతో మనస్తాపం చెంది గురువారం క్రిమి సంహారక మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామిరెడ్డి తెలిపారు.

**బాధ్యతలు స్వీకరించిన ఎంఈఓ రాజయ్య**

**కొలిమిగుండ్ల:** మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో శుక్రవారం మండల విద్యాశాఖాధికారిగా రాజయ్య బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన పదోన్నతుల్లో భాగంగా కోవెలకుంట్ల ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న రాజయ్యకు ఎంఈఓగా పదోన్నతి కల్పించింది. ఈమేరకు కొలిమిగుండ్ల ఇన్‌చార్జ్ ఎంఈఓగా ఉన్నతాధికారులు నియమించారు.

**ధర్మ మార్గంలో నడవాలి**

**అవుకు:** సమస్త జనులందరూ ధర్మ మార్గంలో నడవాలని తిరుమల తిరుపతి దేవస్థనాల హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వహకులు మల్లు వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. టీటీడీ ఆధ్వర్యంలో శుక్రవారం గోపూజ, కుంకుమార్చన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, పెద్దలు నారాయణ రెడ్డి, శివారెడ్డి, వై.శ్రీనివాస రెడ్డి, విశ్వనాథ రెడ్డి, నడిపి శివారెడ్డి, జూనూతల భాస్కర్ రెడ్డి, బోయ జయరాముడు, బాలసుంకన్న, బోయ నాగేంద్రుడు, ప్రకాశ్ రెడ్డి, సూర్యుడు, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

**రైల్వే కంట్రాక్టర్‌పై కేసు నమోదు**

**బేతంచెర్ల:** సికింద్రబాద్‌లోని నార్త్ లాల్ గూడకు చెందిన హరినాథ్‌రావు అనే రైల్వే కంట్రాక్టర్, నిజామాబాద్‌కు చెందిన విశ్వజిత్ రెడ్డి దగ్గర రెండు టాటా హిటాచీ వాహనాలను బాడుగకు తీసుకొచ్చి బేతంచెర్ల మండలంలో 2021లో రైల్వే పనులు చేపట్టాడు. విశ్వజిత్ రెడ్డికి చెల్లించాల్సినరూ. 16 లక్షల బాడుగ చెల్లించలేదు. తనను రైల్వే కంట్రాక్టర్ మోసం చేశాడని విశ్వజిత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివ శంకర్ నాయక్ శుక్రవారం తెలిపారు.

**చంద్రయాన్ విజయోత్సవం ర్యాలీ**

**ప్యాపిలి:** శ్రీహరికోట సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ రెండో ఎల్‌వీఎం3-ఎం4 ఉపగ్రహ నౌక ద్వారా చేపట్టిన ప్రయోగం శుక్రవారం విజయవంతం కావడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. మాందొడ్డి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయుడు రాంబాబు ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

**సీబీఎస్‌సీ స్కూల్ ఏర్పాటుకు సన్నాహాలు**

**డోన్ టౌన్ :** మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరవతో సీబీఎస్‌సీ స్కూల్ ఏర్పాటుకు ముమ్మరంగా అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. స్థలం గుర్తింపునకు జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్ రెడ్డి శుక్రవారం పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. తాత్కాలికంగా స్కూల్ ఏర్పాటుకు పెద్ద బజారులోని ఇటీవల ఖాళీ చేసిన పాత మున్సిపల్ భవనాన్ని ఏఓ ప్రభాకర్‌తో కలిసి పరిశీలించారు. అదేవిధంగా శాశ్వత భవనాల నిర్మాణానికి ప్రభుత్వ ఐటీఐతో పాటు వెంకటాపురం రోడ్డులో ఉన్న పేరంటాలమ్మ గుడి వద్ద ఉన్న ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు.

**మట్కా బీటర్, నాటుసారా విక్రేత అరెస్టు**

**బేతంచెర్ల:** మండల పరిధిలోని ఆర్ ఎస్ రంగాపురంలో దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ శివ శంకర్ నాయక్ తెలిపారు. చనుగొండ్ల రవి మట్కా రాస్తుండగా మట్కా చీటిలతో పాటు రూ. 1,500, హనుమాన్ నగర్‌లో మీనుగ లక్ష్మిదేవి దగ్గర 10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

**కార్మికుల సమస్యలు పరిష్కరించాలి**

**డోన్ టౌన్ :** మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ పట్టణ, మండల కార్యదర్శులు శివరాం, రామాంజనేయులు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాంలో కమిషనర్ వెంకట్రామిరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కుల్లాయప్ప, ఉపాధ్యక్షుడు పెద్ద ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

**ప్రత్యేక అలంకరణలో అమ్మవారు**

**బనగానపల్లెరూరల్:** పట్టణంలోని కొండపేటలో వెలసిన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారు ఆషాఢమాసం శుక్రవారం సందర్భంగా ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారిని పలు రకాల పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం ఆలయ అధ్యక్షులు గాధంశెట్టి వేణుగోపాల్, అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. దాతల సహకారంలో అమ్మవారికి చీరె సారె సమర్పించారు. కార్యక్రమంలో సెక్రటరీ శ్రీరామవెంకటసుబ్రహ్మణ్యం, ట్రెజరర్ సముద్రాల చక్రపాణి, ఆర్యవైశ్య మహిళా సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, ఆర్యవైశ్య సంఘం తదితరులు పాల్గొన్నారు.

**సీఐని కలిసిన సీపీఎం నాయకులు**

**డోన్ టౌన్ :** పట్టణ సీఐగా వీ బాధ్యతలు చేపట్టిన ప్రవీణ్‌కుమార్‌ను సీపీఎం, అనుబంధ సంఘాల నాయకులు శుక్రవారం సర్కిల్ కార్యాలయంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్ప గుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.